కథానిక

# అంకెల గారడీ

చక్రపాణి

సతీమణి ఈనెలుదీసి సున్నమురాసి అందిస్తుండగా ఒక్కొక్క ఆకునే నోట్లోకి కుక్కుతూ కాళ్ళాడిస్తూ విలాసంగా పడుకొని యున్నాడు కాంతారావు. ప్యూను తెచ్చి పడవేసిన దిన, వార, పత్రికలు—కవర్లు—బుక్ పోస్టులో వచ్చిన ఆర్డర్లూ—గోల చేస్తున్నయ్. ఎప్పుడో నాల్గురోజుల క్రితము చుట్టబడి ఊపిరాడక గింజుకొంటున్న బుక్ పోస్టు ఒకటి విముక్తి కల్గించ ప్రార్థిస్తూ సుందరమ్మ కాళ్ళమీద వ్రాలింది. రామభక్తుడైన గోపన్న సీతమ్మను ప్రార్థించిన విషయం కాగితాల చుట్టకు కూడా తెలుసేమో! కాళ్ళపైబడగానే జాలినొంది భర్త కందించింది సుందరమ్మ తమలపాకులు నములుతూనే అందుకొన్నాడు కాంతారావు. మిగతా జాబులు తమ సోదరునకు కల్గపోతున్న స్వేచ్ఛకు సంతోషిస్తున్నట్లు టపటపలాడి తమ ఉనికినికూడా తెలియపరచుకొన్నయ్. కాంతారావ్ నెమ్మదిగా లేచి జాబులుమాత్రం తీసుకొని, దిన, వార, పత్రికలను పైన వ్రేలాడే తడికెపైకి విసరాడు మామూలుగా చంటోడి పాలబుడ్ల కక్కరకువస్తవని. బుక్ పోస్టు చించి సబ్జక్టు చదువుకొని హడావుడిగా లేచి కండ్లజోడుకై కేకేసాడు. అప్పుడే లోపల మంచంపై మేనువాల్చబోతున్న సుందరమ్మ కండ్లజోడుతో వచ్చి, భర్త ఆదుర్దా కనిపెట్టి లోపలకు పోవుటకు మనస్కరించక అక్కడే చాపపై కూలబడ్డది. కాగితము చదువుతున్నకొద్దీ కాంతారావు ముఖము ఊసరవెల్లిని జ్ఞప్తికి తెస్తున్నది. దంతముల ఒత్తిడికి పెదవులు—వ్రేళ్ళ ఒత్తిడికి చేతిలోని కాగితము బాధపడుతున్నయ్. కాంతారావ్ పరధ్యానం కనిపెట్టి చేతిలోని కాగితం తప్పించుకొని పారిపోయి మూలనక్కి ప్రాణం కాపాడుకొంది గాలిదేవుని సహాయంతో.

• • •

విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేసే అర్హత హెడ్‌మాస్టరుకు లేదనియు-ప్రతి విద్యార్థి కృతార్థుడగుటకు సంపాదించుకొనవలసిన కనీసపు మార్కుల నుదహరిస్తూ—ప్రమోట్ అగుటకు హిందీలోగూడా కనీసపు మార్కులు వచ్చియుండవలయుననియు-యీ ఆర్డరు ప్రకారం ప్రమోషన్ లిస్టు పూర్తిచేసి పంపవలసినదిగాను-పై రూల్సుకు భిన్నముగా ప్రవర్తించేవారిపట్ల కఠినచర్య తీసుకోబడుననియు-జారీ కాబడిన ఉత్తర్వులను చూచుకొని, తాను హెడ్‌మాస్టరా-రైటరా-అనే సందేహావస్థలోపడ్డాడు పాపం కాంతారావ్. సంవత్సరములోనుండే పన్నెండు నెలలలో ఎండాకాలపు సెలవులలోని ఒక నెలరోజులుమాత్రమే తాను తీసుకొంటున్న రెండువందల రూపాయలకూ తగిన గౌరవం అందుకొనేది. అదైనా ప్రమోషన్సు చేతిలో ఉండబట్టి! ఇకనుండి యీ మాత్రం గౌరవంకూడా లేకుండాపోయింది పాపం కాంతారావుకు. గౌరవంమాటటుంచండి. ఆర్థికంగా యీ సంవత్సరము తాను పొందబోయే ఆదాయము, ఎదురుచూస్తున్న ఖర్చులు, తలచుకుంటే తల తిరిగిపోయింది పెండ్లి సమయంలో వాయిదా వేసి యింతవరకూ రేడియో, సైకిలు కొనియివ్వనందుకు భర్తపెట్టే బాధలు చెప్పుకొంటూ కుమార్తె వ్రాసిన జాబు-ఇన్సూరెన్సువాళ్ళు వాయిదా వెళ్ళిపోయినందుకు యిచ్చిన నోటీసు-వచ్చేదశమి బుధవారము పిల్లను చూచుటకు వస్తున్నామని కాబోయే వియ్యంకుడు వ్రాసిన లేఖ-కాంతారావ్ కళ్ళ ముందు నాట్యం చేస్తున్నయ్. ఈ సంవత్సరము ప్రమోషన్సు సమయంలో వస్తాయని అంచనా వేసుకొన్న వేయి రూపాయలూ చూస్తుండగనే మాయమైనయ్. తాను నిర్మించుకొన్న ఆశాసౌధాలు కూలినై.

• • •

కాంతారావు స్కూలుకు యంత్రములాగా వస్తూపోతున్నాడు. ఇదివరకటివలె కులాసాగా అభినయపూర్వకంగా కబుర్లు చెప్పడం - సహాయో

పాధ్యాయులు అనందించడం అంతరించినయ్. హిందీలో విద్యార్థికి ప్రమోట్ అగుటకు రావలసిన కనీసపు మార్కులు సుదహారిస్తూ, దానికి తగు చర్యలు తీసుకోవలసిందిగా మాత్రం హిందీ పండితుల వారికి నోటీసు జారీచేశాడు తన విధ్యుక్త ధర్మం ప్రకారం కాంతారావు.

పాపం యింతకాలంవరకూ ఆ జిల్లాబోర్డువారు యిస్తున్న అరువది ఒక్క రూపాయలను తీసుకోవడం-వారంలో యిరువదిమూడు పిరియడ్లు టీచర్సు వెయిటింగ్ రూములో నిద్రపోవడం-పదమూడు పిరియడ్లు క్లాసులో కుర్చీలో నిద్రపోవడం-గంటకొట్టగనే సాటి తెలుగుపండితులవారితో ముచ్చటిస్తూ యింటికి వెళ్ళడం—యిది హిందీ పండితుడు రామనాధం చేస్తున్న పని. పిల్లలకన్యాయము చేయడం మంచిదిగాదని కార్యక్రమంలోకి దిగి క్లాసుకెళ్ళితే ఒక్కవిద్యార్థికీ పాఠ్యపుస్తకము లుండవు. అధవా ఉన్నా, వాటిని పట్టుకొనే విధానంకూడా తెలియదాయె పిల్లలకు. ఇంగ్లీషు, రెండు తెలుగులు - సాంఘిక శాస్త్రము - విజ్ఞాన శాస్త్రము—తలచుకొంటేనే గుండె జల్లుమనే ఆ గణిత శాస్త్రము—వీటితోటే సతమతమౌతుంటే ప్రమోషన్‌కు ప్రాముఖ్యంలేని హిందీ ఎవడికి కావాలి?

కాంతారావు పంపిన నోటీసు చూచుకొన్న రామనాధం ఆ రోజే అక్షరాభ్యాసం చేసాడు అన్ని క్లాసుల్లో. ఆ సిలబస్ చూసేసరికి రామనాధం గారికే గుండెదడ ప్రారంభమైనది. పిల్లల సంగతి సరేసరి.

ఈ నెలరోజులు ఒక్క హిందీకొరకే కృషి చేస్తే మిగతా సబ్జక్టులవిషయం ఏంకావాలి? పండితుడు కాబట్టి రామనాధం దీనికి మార్గం కని పెట్టాడు తన చుట్టమైన సత్యమూర్తితో ఆలోచించి. తెల్లవారేసరికి రామనాధం యింటికి సీమ సున్నంతో వ్రాసినబోర్డు ఒకటి తగిలించియుంది.

"అన్ని తరగతులవారికి నెలరోజులలో హిందీ నేర్పబడును. ఫీజు పదిరూపాయలు మాత్రమే. ఈ భాషలో కృతార్థులు కాని వారికి డబ్బు వాపసు యివ్వబడును. రేపటి నుండియే పాఠములు ప్రారంభించబడును.

ట్యూటర్: సత్యమూర్తి"

చుట్టమార్గంగా రామనాధంగారిని చూడ్డానికొచ్చి నేడో రేపో వెళ్ళిపోవాలనుకొనే సత్యమూర్తి ట్యుటోరియల్ స్కూలు పెట్టేటప్పటికి ఆశ్చర్యపోయారు వారంరోజులపాటి స్నేహితులు. పిల్లలపాలిటికి దేవుడిలాగ సహాయపడ్డావని పొగడారు పిల్లల సంరక్షకులు. వారం తిరక్కుండానే తన ఏబదిమంది శిష్యుల్నీ రామనాధంగారి చేతికప్పగించి కారెక్కాడు సత్యమూర్తి. కారెక్కేముందు చార్జీలకు సత్యమూర్తి చేతిలో పెట్టిన పచ్చకాగితాన్ని చూచిన ఒకరిద్దరు ఉపాధ్యాయులు తెలుసుకొన్నారు — ధనలక్ష్మికోసం రామనాధం వేసిన ప్లాన్.

* * *

హిందీపరీక్ష ఆ నాడే. రామనాధంగారు ప్రశ్నపత్రముల చేబూని ప్రతి గదికీ వెళ్ళి ప్రశ్నపత్రముల చదివి వినిపిస్తున్నారు. ఆయన ప్రశ్నలే చదువుతున్నాడో—సమాధానములే డిక్టేట్ చేస్తున్నాడో అక్కడున్న వాచర్లకుగాని తన ఖర్మకి వచ్చిన ప్రధానోపాధ్యాయుల వారికిగాని తల పగులకొట్టుకొన్నా అర్థంకావడంలేదు. పైగా ఆ భాషోచ్చారణకు ఆ ప్రధాన సహాయోపాధ్యాయులు ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నారు ఒకరి మొగము ఒకరు చూచుకుంటూ. రామనాధంగారి విద్యాబోధనా నైపుణ్యమేమోగాని హిందీలో చదివింది నెలరోజులైనా రావలసిన కనీసపు మార్కులు ఒక్కరికీ తగ్గలేదు. ఐదు పచ్చకాగితములతో కారెక్కుతున్న రామనాధంగారిని చూచేసరికి సంవత్సరమంతా చెప్పుకొన్న రెండువందలైనా ముట్టని యితర పంతుళ్ళు బిక్కమొగంవేశారు. కాకుంటే ఎల్లకాలం ఒకరివేనా రోజులు? రోజులు మారాయ్!

హిందీమార్కులను సెంట్రల్ మార్కుల్స్ రిజిస్టరులోకి ఎక్కిస్తూ కాంతారావు నిర్ఘాంతపోయాడు. హిందీలో ఒక్కడూ ప్యాసు కాడనుకొంటే తప్పినవాడే కన్పించడే! కారణం?—రామనాధం—ఐదు పచ్చనోట్లు-కళ్ళలో మెదులుతున్నయ్ కాంతారావుకు.

రామనాధానికి పట్టిన అదృష్టం, తాను కోల్పోయిన అదృష్టం, తలచుకొనేసరికి కళ్ళల్లో నీళ్ళుతిరిగి

నయ్. తమవద్ద చదువుకొని గొప్ప ఉద్యోగములు చేస్తూ, మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించుకొని-చివరకు గురువులకే ద్రోహం తలపెట్టిన ఆ అధికారులను తలచుకొనేసరికి గురుశిష్యులమధ్య నుండవలసిన వాత్సల్యము అంతరించింది. ఆ స్థానాన్ని క్రోధమాక్రమించింది. కాని ఏమిచేయగలడు?—బ్రతకలేక చేరిన బడిపంతులు.

బంట్రోతు టపాల్ని కుర్చీపై నుంచాడు. మళ్ళీ ఆ బుక్ పోస్టు చుట్టను చూచేసరికి అప్పుడే కనుక్కొన్నాడు ఎక్కడినుండి వచ్చిందీనూ. తప్పకుండా—గాయగెద్దు జీవితం—విప్పాడు...చదివే కొద్దీ ఏదో తెలియని ఆనంద తరంగాలు పుట్టుకొస్తున్నయ్. ఆ కాగితములోని ఒకే ఒక పేరా అతనికి కనకాభిషేకం చేస్తుందని తట్టింది. చదివినదే పదిసార్లు చదివాడు:

'సంవత్సరాంతపు పరీక్షలలో ఒకటి, లేక రెండు సబ్జక్టులలో తప్పిన బాలురు, ఆ సబ్జక్టులలో అర్ధసంవత్సరపు పరీక్షలలో రావలసిన మార్కులు సంపాదించుకొనియున్న పైతరగతికి ప్రమోట్ అగుటకు అర్హులు'...

ఇది చాలు కాంతారావుకు. ఎంతైనా నాటక మాట్లాడు. కూలిపోయిన ఆశాసౌధాలు లేచినై. కూతురూ అల్లుడూ సుఖంగా చిలకాగోరువంకల్లాగ కాపురం చేస్తారు... రెండవ కూతురు పెళ్ళి ఔతుంది...

ఒక్కసారిగా కాంతారావుకు తన శిష్యులైన అధికారులపై వాత్సల్యము పెల్లుబికింది. గంట క్రితం వారి ననవసరంగా మనస్సులో దూషించినందుకు తనకు తాను నిందించుకొన్నాడు. శిష్యులు వెయ్యేండ్లు వర్ధిల్లాలని నిండుమనస్సుతో దీవించాడు నెలరోజులుగా మానవలోకంలోనున్నట్లు కన్పించని కాంతారావు, కళకళలాడుతూ యింటికి వస్తుంటే శాంతామణి కండ్లనీళ్ళు తుడుచుకొంది.

సంవత్సరాంతపు పరీక్షలలో రావలసిన మార్కుల కన్న తక్కువ వచ్చిన వాటిక్రింద అర్ధసంవత్సరపు మార్కులతో చిత్తుప్రతి తయారు చేసాడు కాంతారావు. నమ్మినబంటు నారాయణ భుజం తట్టాడు. నారాయణ పగలు నాల్గురోజులు ఊర్లో కన్పించలేదు. కాని ప్రతిరోజూ రాత్రుల్లు కాంతారావుతో గుసగుసలు పక్కింటి వాటాలో వాళ్ళకు విన్పిస్తునే వున్నయ్.

జిల్లాబోర్డువారి ధర్మమా అంటూ వారు సమయానికి ఎర్రసిరా సప్లయ్ చేయకపోవడం కూడా మంచిదే అయింది. అన్నియూ మనమంచికే అనే సామెత ఊరికే పుట్టిందా?– అందువలననే మార్కులన్నీ ఎర్రపెన్సిలితో ఎంటర్ చేసుకొన్నాడు అర్ధసంవత్సర పరీక్షలప్పుడు. అప్పుడు ఎర్రసిరా సప్లయ్ చేయనందుకు విసుక్కొన్నా యిప్పుడు తనకెంత లాభకారి అయిందీ తెల్సుకొన్న తర్వాత తొందరపడి ఎప్పుడూ యితరుల్ని దూషించకూడదని నిర్ణయించుకొన్నాడు.

నారాయణ యిచ్చిన లిస్టుప్రకారం అర్ధసంవత్సరపు మార్కులు తారుమారు అవుతున్నయ్. అదే...అంకెల గారడీ...'సున్నా'కు ఎడమవైపు అంకెలు మొలుస్తున్నయ్...'ఒకట్లు' నాల్గులుగా, ఆర్లుగా, ఏళ్ళుగా, తొమ్మిదులుగా రూపాంతరం దాలుస్తున్నయ్. 'మూడు' ఎనిమిదిగా మారుతున్నది. పాపం 'ఒంటి' అంకెలు జతను సంపాదించుకొంటున్నయ్...పూర్వం విష్ణుమూర్తి దశావతారాలెత్తాడంటే చూసిందెవరుగాని ... యిప్పుడు అంకెలే సహస్రావతారాలెత్తుతుంటే చూసి ముక్తిపొందే అవకాశం లభించింది మానవకోటికి!

ఈ మార్పులు కనుక్కొంటారనే భయం ఏమాత్రం లేదు కాంతారావుకు. ఉపాధ్యాయులెప్పుడో ఎంటర్ చేసి క్రింద సంతకము పెట్టారాయె! పేపర్లా...పిల్లల చేతులగుండా అప్పుడే అప్పయ్యకొట్లోకి పోయినై కాస్త కలకండ ముక్కకు. అంకెల దిద్దులా...బ్రహ్మకైనా తరంగాదు పట్టడానికి.

ఇక నాలుగు రూకలు రాలే సూచనలు సన్నగిలగనే తయారైనయ్ ట్రిప్లికేట్ లో లిస్టులు. పోస్టుబిళ్ళల నతికించుకొని తుర్రున ఎగిరి వ్రాలినై జిల్లా విద్యాశాఖాధికారి ఆఫీసులో. కృతార్థులైన మొత్తం రెండువందల మందిలో సంవత్సరాంతపు పరీక్ష మార్కులబట్టి ఎనుబది మంది-అర్ధసంవత్సరపు మార్కుల సహాయంతో నూటయిరువది మంది... ఉన్నట్లు తేలింది. కాదనేవారెవరు?...కాగితాల మీద అంకెలు కొట్టొచ్చినట్లుంటే!

★